# గల్లిగల్లిలో పైసల లొల్లి

- ఎమ్మెల్యే హరిప్రియ క్యాంప్ ఆఫీసు ముట్టడి..
- మాకు ఇంకా డబ్బు అందలేదని ప్రజాప్రతనిధులతో వాగ్వాదం..
- ప్రధాన పార్టీలపై తిట్ల వర్షం..
- పోలింగ్ చివరి క్షణం వరకు డబ్బులు పంపిణీ..



**ఇల్లందు,నవంబర్30(కెరటం ప్రతినిధి)**

పోలింగ్ వేళ ఇల్లందు కేంద్రంలో గల్లిగల్లిలో పైసలు లొల్లి జరిగింది.గురువారం స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ క్యాంప్ ఆఫీసును కొంతమంది మహిళలు ముట్టడి చేశారు.డబ్బులు ఇస్తే అందరికీ ఇవ్వండి లేదంటే ఎవ్వరికి ఇవ్వకూడదని అక్కడున్న నాయకులను నిలదీశారు.ఇకపోతే మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగియడంతో ప్రధాన పార్టీలు గల్లీ గల్లీలలో పైసలు పంచే కార్యక్రమాన్ని మొదలుపెట్టి ఏకంగా గురువారం సాయంత్రం పోలింగ్ సమయం 4 గంటల వరకు డబ్బులు పంచడం గమనార్హం. ప్రధానంగా రెండు పార్టీలు తమ తమ కార్యకర్తలకు వారి పార్టీ సభ్యులకు డబ్బులు పంచే కార్యక్రమంలో భాగంగా గల్లీలలో ఒక ఇంటికి వెళ్లి ఇవ్వడం మరో ఇంటికి వెళ్లకుండా వెళ్లిపోవడంతో ప్రజలు ప్రధాన పార్టీలపై తిట్ల వర్షం కురిపించారు.తమకు అవసరం ఉన్నప్పుడు ప్రధాన పార్టీలు ర్యాలీలకు బహిరంగ సభలకు తీసుకు వెళ్తూ 200 నుంచి 500 వరకు ఇచ్చారని,ఇప్పుడు గల్లీలలో ఓటుకు వెయ్యి,పదిహేను వందలు పంచుతున్నారని తెలియడంతో స్థానిక ప్రజలు తమకు కూడా డబ్బులు వస్తాయని పంచే వారి దగ్గరికి వెళ్తే మీరు మా పార్టీ కాదు కదా మేము ఎందుకు ఇవ్వాలి? అంటూ వెనక్కి పంపుతుండడంతో కొన్ని చోట్ల ఘర్షణ సైతం జరిగింది.దాంతో ప్రజలే పోలీసులకు ఫోన్లు చేసి ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి వరకు పంచుతున్నటువంటి డబ్బులను పోలీసులు వస్తున్నారని సమాచారం అందుకున్న పార్టీ కార్యకర్తలు వెంటనే గల్లిలలో నుండి మాయమ య్యారు. గురువారం ఉదయం 4,5 గంటల నుండే డబ్బులు పంపకాలు మొదలైయ్యాయి.పెద్ద పెద్ద వారిని గుర్తించి మరి వారి ఇంటికి వెళ్లి డబ్బులను పంపిణీ చేశారు.చిన్న చిన్న గల్లీలను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులను డబ్బులు రాని కొంతమంది ప్రజలు నిలదీసారు.మేము ఎందుకు ఓటు వేయాలి మేము ఓటు వేయము అని నినాదం పలుకుతు న్నారు. ఇలా డబ్బులు పంచి ఓట్లు వేయించుకుంటే నిజాయితీపరులను ఎలా ఎన్నుకునేది? అంటూ ఇల్లందు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.దీనికి జవాబుదారు ఎవరు అనే ప్రశ్న ఏర్పడింది.







## ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల పోలింగ్

**ఇల్లందు,నవంబర్30(కెరటం ప్రతినిధి)**



నియోజకవర్గంలో తెలంగాణ సార్వత్రిక ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి.ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.ఉదయం మందకొడిగా మొదలైన పోలింగ్ 9 గంటలకు ఊపందుకుంది. వృద్ధులు,వికలాంగులు నియోజకవర్గ పరిధిలోని మొత్తం 241 పోలింగ్ కేంద్రాలలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మొదటి సారి ఓటు హక్కును యువకులు వినియోగించుకున్నారు. నియోజక వర్గంలో 79.3 శాతం పోలింగ్ నమోదు అయింది. బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్,కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య,బీఎస్పీ అభ్యర్థి బాధావత్ ప్రతాప్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడక్కడా చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

## ప్రజాస్వామ్య మునుగడకు ఓటు హక్కు కీలకం

### ఓటు హక్కు వినియోగించుకున్న బీఎస్పీ అభ్యర్థి కామేష్

**కొత్తగూడెం, నవంబర్30(కెరటం ప్రతినిధి)**



ప్రజాస్వామ్య మునుగడకి ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికలు కీలకమని ఆ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని బిఎస్పి కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కామేష్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద గల 159 వ పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆలోచింపజేసి వారిలో చైతన్యం రగిలించడమే బీఎస్పీ పార్టీ మూల సిద్ధాంతమని అన్నారు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొత్తగూడెం నియోజకవర్గం అభ్యర్థిగా ఆ విషయంలో తాను సఫలీకృతమైనట్లు తెలిపారు.అదేవిధంగా బీఎస్పీ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్క ఓటరుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు




## సెయింట్ జోసెఫ్ హై స్కూల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**చుంచుపల్లి, నవంబర్30(కెరటం ప్రతినిధి)**

చుంచుపల్లి మండలంలోని దంబాద్ పంచాయతిలో ఉన్న సెయింట్ జోసెఫ్ హై స్కూల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి సంవత్సరం జరుపుకొనే విధంగా ఈ సంవత్సరం కూడా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు క్రీడా పోటీలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వైస్- ప్రిన్సిపాల్ బ్రదర్ జార్జి రెడ్డి, ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి, బ్రదర్ అభిలాష్ విచ్చేశారు. ముఖ్యఅతిథి వైస్- ప్రిన్సిపాల్ బ్రదర్ జార్జి రెడ్డి ఈ క్రీడా పోటీలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ముఖ్యఅతిథి చేతుల మీదుగా క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి, వైస్- ప్రిన్సిపాల్ బ్రదర్ జార్జి రెడ్డి, బ్రదర్ అభిలాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

